సాక్షి ప్రకాశం

మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



పార్టీ మారే ప్రసక్తే లేదు

తామంతా వైఎస్సార్ సీపీలోనే ఉంటామని, పార్టీ మారే ప్రసక్తే లేదని కొత్తపట్నం మండల ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్పష్టం చేశారు. - 8లో..



అధికార పార్టీ దౌర్జన్యం

పొదిలి మండలం కొండాయపాలెంలో టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసి సచివాలయం పక్కన నివాసం ఉండే పారిశుద్ధ్య కార్మికుని ఇంటిని కూలగొట్టారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35.6/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జంకెను పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి



జంకెను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిని సోమవారం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పరామర్శించారు. అనారోగ్యంతో కొంతకాలంగా హైదరాబాద్‌లోని అపోలో వైద్యశాలలో చికిత్స పొందుతున్న జంకెను ఆయన కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి వారిద్దరూ చర్చించినట్లు తెలిసింది.

దర్శిలో బాలినేని ఫ్లెక్సీ వివాదం



రాత్రిపూట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


దర్శి: దర్శి పట్టణంలో ఆదివారం సాయంత్రం జనసేన పార్టీకి చెందిన కొందరు తమ పేర్లు వేసి బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలో చేరుతున్న సందర్భంగా ఆహ్వానం పలుకుతూ ‘వెల్కమ్ బాస్’ అంటూ ఫ్లెక్సీ ని ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలో కాపు నాయకులు వంగవీటి మోహనరంగా, చిరంజీవి, నాగేంద్రబాబు ఫొటోలతో పవన్ కళ్యాణ్‌ను బాలినేని కలసిన ఫొటోలు ఫ్లెక్సీలో వేయించారు. టీడీపీవారి ఫొటోలు మాత్రం వేయలేదు. రాత్రిపూట ఫ్లెక్సీలో పేర్లు ఉన్న తిరుమల మహేష్‌బాబు, మధు, సుబ్బారావు, సాధిక్‌లు దాన్ని ఏర్పాటు చేసి పోయారు. తెల్లవారేసరికి ఫ్లెక్సీ అక్కడ లేక పోవడంతో తొలుత ఏమైందో అని ఆందోళన చెందారు. ఆ తరువాత ఫ్లెక్సీని నగర పంచాయతీ వారే తొలగించారని తెలిసింది. దీంతో ఫ్లెక్సీలో టీడీపీ నేతల ఫొటోలు లేవని తొలగించారా...? లేక బాలినేని జనసేనకు రావడం టీడీపీకి ఇష్టం లేక తొలగించారా..? గతంలో ఉన్న ఫ్లెక్సీలపై దానిని ఏర్పాటు చేశారని తొలగించారా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

పెండింగ్ కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి


- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: మీకోసం అర్జీలతోపాటు పెండింగ్ కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు కేసులకు సంబంధించి ధిక్కార నోటీసులు రాకుండా ముందుగానే అవసరమైన వకాలత్, కౌంటర్, రివ్యూ, రిట్ పిటిషన్‌లు సకాలంలో దాఖలు చేయాలన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయి అధికారులతో మీకోసం అర్జీల పరిష్కారం, పెండింగ్ కోర్టు కేసులపై వీడియో సమావేశం నిర్వహిస్తానన్నారు. పత్రికల్లో ప్రచురితమైన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించి సంబంధిత నివేదికలు కలెక్టరేట్‌కు పంపాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘ఇది మంచి ప్రభుత్వం’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో ఉద్యోగులు ప్రజలంతా పాల్గొనేలా చూడాలన్నారు. దీనిలో సీపీవో డీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లా మైన్స్ అండ్ జియాలజీ ఆఫీసర్‌గా రాజశేఖర్



ఒంగోలు సిటీ: జిల్లా మైన్స్ అండ్ జియాలజీ ఆఫీసర్ (డీఎం అండ్ జీఓ) గా కె.రాజశేఖర్ నియమితులయ్యారు. ప్రస్తుతం కర్నూలు జిల్లా మైన్స్ అండ్ జియాలజీ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ బదిలీపై వస్తున్నారు. ఈ మేరకు ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న బి.జగన్నాథరావు ను జిల్లా మైన్స్ అండ్ జియాలజీ ఆఫీసర్ గా విశాఖపట్నానికి బదిలీ చేశారు.



✦ జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)గా గొట్టిపాటి వెంకట నాయుడు నియమితులయ్యారు. ప్రస్తుతం అనంతపురం జిల్లా డ్వామా ఫైనాన్స్ మేనేజరుగా విధులు నిర్వహిస్తూ ప్రకాశం జిల్లా డీపీవోగా బదిలీ అయ్యారు.



✦ జెడ్పీ సీఈవోగా భూపతి చిరంజీవి నియమితులయ్యారు. ప్రస్తుతం ఇతను నెల్లూరు డిప్యూటీ సీఈవోగా విధులు నిర్వహిస్తూ ప్రకాశం జిల్లా జెడ్పీ సీఈవోగా బదిలీ అయ్యారు.

లచ్చిందేవీ.. ఆవాహయామీ!



దర్శి నియోజకవర్గంలో యజ్ఞంలా టీడీపీ నేత ఇసుక దందా

100 రోజుల్లో రూ.15 కోట్లకు పైగా దోపిడీ

- ముండ్లమూరు మండలం పోలవరం రీచ్ నుంచి రోజూ 70 నుంచి 100 టిప్పర్ల ఇసుక అక్రమ రవాణా
- దోపిడీ సొమ్ము వసూళ్లకు అనుచరులను నియమించిన టీడీపీ ముఖ్య నేత
- గత ప్రభుత్వంలో ఇసుక సీనరేజీ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం
- ఇప్పుడు ఆ ఆదాయాన్ని దర్జాగా దిగమింగుతున్న టీడీపీ ముఖ్య నేత
- ఇసుక అక్రమ రవాణా ఫొటోలు తీసిన వారిని రీచ్‌లోనే పాతేస్తామని బెదిరింపులు
- ప్రజల ఫిర్యాదులపై ఏమాత్రం స్పందించని విజిలెన్స్, రెవెన్యూ, పోలీస్ అధికారులు



పోలవరంలో టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నేత అనుచరులు

కవి భర్తృహరి చెప్పినట్టు ఇసుకను పిండి తైలము తీయవచ్చో లేదో తెలియదు కానీ అడ్డగోలుగా అమ్మేసి సొమ్ము చేసుకోవచ్చని అధికార టీడీపీ నాయకులు నిరూపిస్తున్నారు. కూటమి పాలనలో టీడీపీ నాయకులు అయాచితంగా లబ్ధి పొందడానికి, దండిగా ఆదాయం సమకూర్చుకోవడానికి ఇసుక ప్రధాన వనరుగా మారింది. దర్శి నియోజకవర్గంలో నిఘా వ్యవస్థల పెడ రెక్కలు విరిచి ఇసుక దందా సాగిస్తున్న తీరు ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. నేలతల్లి ఒడిలో నిర్విరామంగా ధ్వంస రచన సాగిస్తూ.. రోజూ వందల ట్రక్కుల ఇసుకను తరలిస్తూ టీడీపీ నేత రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. గడిచిన 100 రోజుల్లో ఇసుక అక్రమ రవాణా ద్వారా టీడీపీ ముఖ్య నేత రూ.15 కోట్లకు పైగా ఆర్జించినట్లు సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. ఇసుక ఉచితం అని ఓ వైపు ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ.. మరో వైపు టీడీపీ నేత దోపిడీకి ప్రభుత్వ పెద్దలే అన్ని విధాలా సహకరిస్తుండటం తీవ్ర చర్చనీయాంశమైంది.

దర్శి: ‘‘ఆదాయమంతా ఆమెకేనా.. మరి మా సంగతేంటి? ఒక్క ట్రక్కు ఇసుక కూడా తెచ్చుకోలేకపోతున్నాం.. వాళ్లు రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. మేము ఇంకా ఎన్నాళ్లు పడిగాపులు కాయాలి. పదో పరకో సంపాదించుకోవాలి కదా’’ ఇదీ దర్శి నియోజకవర్గ టీడీపీ నేతల మనోవేదన. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరు మండలంలో ఇసుక దోపిడీ యజ్ఞంలా సాగుతోంది. సొంత పార్టీలో ద్వితీయ శ్రేణి నేతలను సైతం దూరం పెట్టి టీడీపీ ముఖ్య నేత కుటుంబం ఇసుకను యథేచ్ఛగా తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటోంది. ముండ్లమూరు మండలం పోలవరం గ్రామంలోని ఇసుక రీచ్ నుంచి రోజూ 70 నుంచి 100 టిప్పర్ల వరకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ లెక్కన గడిచిన 100 రోజుల్లో టీడీపీ ముఖ్య నేత రూ.15 కోట్లకు పైగా పోగేసుకున్నట్లు కడుపు మండిన సొంత పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానంలో దర్శిలో టిప్పర్ ఇసుక రూ.32 వేలు పలుకుతోంది. ప్రభుత్వం చెప్పినట్లు ఉచిత ఇసుక ఇస్తే ముండ్లమూరులో ఈ స్థాయి ఇసుక దందా సాగేదే కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలవరంలో తవ్వేసిన ఇసుకను అద్దంకి, నరసరావుపేట, ఈదర మీదుగా వినుకొండ, తాళ్లూరు మీదుగా చీమకుర్తి, ఒంగోలు చుట్టు పక్కల ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం.

దోపిడీపై గుత్తాధిపత్యం

ముండ్లమూరు మండలం పోలవరం ఇసుకకు నిర్మాణ రంగంలో గిరాకీ ఉంది. దీంతో ఆ ప్రాంతంలో రిజిస్టర్డ్ భూములను సైతం టీడీపీ ముఖ్య నేత బెదిరించి కొనుగోలు చేసి, అనధికారికంగా ఇసుక తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. సొంత పార్టీ నేతలు కూడా ఇసుక దోపిడీ వ్యవహారంలో వేలు పెట్టకుండా హుకుం జారీ చేశారు. టీడీపీ ముఖ్య నేత తమ సామాజికవర్గానికి చెందిన అధికారులను పావులుగా వాడి ఇసుక దందా చేస్తున్నట్లు ముండ్లమూరు మండలం కోడై కూస్తోంది. వర్షాల నేపథ్యంలో నెల్లూరు, అమరావతి నుంచి ఇసుక సరఫరా నిలిచిపోయింది. దీంతో ఇసుకకు ఏర్పడిన డిమాండ్‌ను టీడీపీ నేత సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరికి ఇసుక కావాలన్నా ‘పచ్చ’ టిప్పర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి.

ప్రశ్నిస్తే.. పాతేస్తాం!


పోలవరం ఇసుక రీచ్‌లో పొక్లెయిన్లు, పెద్ద సంఖ్యలో టిప్పర్లు వినియోగించి ఇసుకను లూటీ చేస్తున్నారు. టిప్పర్‌కు ఇసుక ఎత్తినందుకు రూ.10 వేల లెక్కన తమ మనుషులను పెట్టి వసూలు చేస్తున్నారు. ఇసుక తరలించే సమయంలో అటువైపు ఎవరైనా వెళ్లినా.. ఫొటోలు తీసినా టీడీపీ గూండాలు దాడి చేసేందుకు వెనుకాడటం లేదు. ఇసుక రీచ్ పరిసరాల్లో కనిపించినా, ప్రశ్నించినా గొయ్యి తీసి పాతేస్తామని హెచ్చరించి పంపుతున్నారు. దీంతో ఆ వైపు వెళ్లేందుకు ఎవరూ సాహసం చేయడం లేదు. తనిఖీలకు వెళ్లిన అధికారులకు సైతం క్షణాల్లో ఫోన్లు చేసి బెదిరిస్తుండటంతో చేసేదేమీ లేక వెనుదిరుగుతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పోలవరంలో ఇసుక సీనరేజీ ద్వారా రాష్ట్ర ఖజానాకు కోట్లాది రూపాయల ఆదాయం సమకూరింది. అందుకు అనుగుణంగా రీచ్‌ల వద్ద ఇసుక తరలింపునకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో సీనరేజీలు ఏర్పాటు చేశారు. ఇసుక కావాల్సిన వారు నేరుగా సీనరేజీకి వెళ్లి నాణ్యత పరిశీలించుకుని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని కొనుగోలు చేసుకునేవారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా నాణ్యమైన ఇసుకను ప్రజలకు అందించారు. సొంత వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు ఉన్న వారు సైతం సీనరేజీ అనుమతులు తెచ్చుకుని ప్రభుత్వ ధరకు అమ్ముకునేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులేవీ లేవు. కేవలం దందా మాత్రమే నడుస్తోంది. ఇదిలా ఉండగా వాగుల్లో ఇసుకను ఇష్టారీతిగా తవ్వి తరలిస్తుండటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

అధికారులు గప్‌చుప్!

రహదారి కంపించేలా పదుల సంఖ్యలో ఇసుక లారీలు వరుసగా దూసుకెళ్తున్నా పోలీస్, రెవెన్యూ, మైనింగ్ అండ్ విజిలెన్స్ అధికారులు అడ్డుకునే సాహసం చేయడం లేదు. దర్శి పోలీస్ స్టేషన్, రెవెన్యూ కార్యాలయం, ముండ్లమూరు పోలీస్‌స్టేషన్ ముందు నుంచే ఇసుక అక్రమంగా తరలిపోతున్నా పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. దర్శి గడియార స్తంభం సెంటర్‌లో పోలీసుల కళ్ల ముందే ఇసుక టిప్పర్లు దర్జాగా వెళ్తున్నా తలవంచుకుని నిలబడటమే అధికారుల వంతైంది. గడియార స్తంభం సెంటర్‌లో సీసీ ఫుటేజీలు పరిశీలిస్తే ఇసుక అక్రమ దందా ఏ స్థాయిలో సాగుతోందో తేలుతుంది.



పోలవరంలో ఇసుక తవ్వడంతో ఏర్పడిన భారీ గుంతలు

పోలీసు స్టేషన్లో ఆత్మహత్యాయత్నం

- ఎస్‌ఐ కొట్టాడంటూ మీడియా ముందు దళిత యువకుడు కన్నీరు మున్నీరు
- జీజీహెచ్‌కు తరలించిన పోలీసులు



జీజీహెచ్‌లో చికిత్స తీసుకుంటున్న బాధిత దళిత యువకుడు కుమార్



బాధిత యువకుడు కుమార్‌ను పరామర్శిస్తున్న దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు

ఒంగోలు టౌన్: విచారణ పేరుతో పోలీసు స్టేషన్‌కు పిలిపించిన ఎస్‌ఐ తనమీద చేయి చేసుకున్నాడన్న మనస్తాపంతో ఒక దళిత యువకుడు పోలీసు స్టేషన్లోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సంచలనం సృష్టించింది. బాధితుడు, దళిత సంఘాల నేతల కథనం ప్రకారం... చిత్తూరు జిల్లా మంగుంట గ్రామానికి చెందిన దామగుంట కుమార్ కుటుంబ అవసరాల కోసం 2019లో అక్కడి టీడీపీ నాయకుడైన చిత్తూరు చంద్రబాబు, చిరిపిరెడ్డి, నరసింహారెడ్డిల వద్ద రూ.10 లక్షల అప్పు చేశాడు. రూ.5 లక్షల అప్పు కుమార్ తిరిగి చెల్లించాడు. మిగతా రూ.5 లక్షల అప్పునకు గాను చంద్రబాబు ముఠా బాధితుడి పేరు మీద చీట్లు వేసి పాడుకుంది. అయినా సరిపోదంటూ కుమార్ నుంచి మూడు ఎకరాల పొలం, ఇంటిని రాయించుకున్నారు. అయినా అప్పుతీరలేదని వేధిస్తుండటంతో కట్టుబట్టలతో కుమార్ ఊరు వదలి ఒంగోలు వచ్చి జీవిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబు ముఠా స్థానిక టీడీపీ నాయకుడైన ఉండపల్లి రాము తదితరులతో కలిసి వెంకటేశ్వర కాలనీలోని కుమార్ ఇంటిపై శనివారం రాత్రి దాడికి పాల్పడ్డారు. కులం పేరుతో తిడుతూ నిన్ను అంతం చేస్తామంటూ బెదిరించారు. దాంతో భయాందోళనకు గురైన కుమార్ 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ వచ్చి పోలీసు స్టేషన్‌కు తీసుకొని వెళ్లి మాట్లాడారు. సమస్య చిత్తూరు జిల్లాకు సంబంధించిందని, అక్కడకు వెళ్లే సమస్యను పరిష్కరించుకోవాలని ఎస్‌ఐ ఫిరోజ్ సూచించారు. సోమవారం చిత్తూరు వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న సమయంలో తాలూకా పోలీసులు ఫోన్ చేసి ఇక్కడే సమస్యను పరిష్కరిద్దామంటూ పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. మర్యాదగా డబ్బులు చెల్లించమని, లేకపోతే నీ భార్య, ఇతర కుటుంబ సభ్యులపై కేసులు పెట్టి బయటకు లాగుతామని బెదిరించారు. స్టేషన్‌కు వెళ్లిన కుమార్‌పై ఎస్‌ఐ ఫిరోజ్ చేయి చేసుకున్నాడు. చెంపల మీద, చెవుల మీద కొట్టారు. ఎస్‌ఐ కొడుతుంటే చిత్తూరు నుంచి వచ్చిన వాళ్లు నవ్వుకుంటున్నారని, దాంతో మనస్తాపం చెందిన కుమార్ అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అతడిని జీజీహెచ్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కుమార్‌ను దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు పరామర్శించారు. దళిత యువకుడి ఆత్మహత్యాయత్నానికి కారణమైన టీడీపీ నాయకుడు చిత్తూరు చంద్రబాబు ముఠాపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో దళితుల మీద దాడులు పెరిగిపోయాయని, పోలీసు స్టేషన్‌లోనే దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్షణ నిలయంలో దళితులకు రక్షణ లేకుండా పోవడమే మంచి ప్రభుత్వమా అని ప్రశ్నించారు.

వైద్య విద్యార్థి ఇంట్లో విషాదం

మార్కాపురం: పట్టణంలోని తర్లపాడు రోడ్డులో నివాసముంటున్న చింతగుంట రవికుమార్ కుమారుడు హరిదీప్ ఏలూరులోని ఆశ్రమం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతూ ఆదివారం తన ఫ్రెండ్స్ తో కలిసి అల్లూరు జిల్లా మారేడుమిల్లి జలపాతం వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఈ సమాచారం తెలుసుకున్న హరిదీప్ తల్లిదండ్రులు రవికుమార్, సుమ ఇద్దరూ హడావుడిగా తన కుమారుడు ఏమయ్యాడో తెలుసుకునేందుకు ఆదివారం సాయంత్రం ఏలూరు వెళ్లి అక్కడి నుంచి మారేడుమిల్లి వెళ్లారు. రవికుమార్ మార్కాపురం పట్టణంలో బిల్డింగ్ ప్లానర్ గా పని చేస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు హరిదీప్ ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంచి డాక్టర్ గా తన కుమారుడిని చూడాలనుకున్న తల్లిదండ్రులకు అతను మృతిచెందాడని ఆదివారం సాయంత్రం తెలియడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఈ సంఘటన వారి కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. హరిదీప్ మృతదేహాన్ని మంగళవారం మార్కాపురం తీసుకురావచ్చని సమాచారం.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



గ్రీవెన్స్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు అలసత్వం లేకుండా పనిచేయాలని నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక భవనంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకితో కలిసి మీకోసం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సకాలంలో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులతో మాట్లాడుతున్న ఫొటోలతో పాటు పరిష్కరించిన ఎండార్స్‌మెంట్లను సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆర్థిక అంశాలతో ముడిపడిన సమస్యలైతే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. పరిష్కరించలేని సమస్యలు ఉంటే అర్జీదారులను పిలిచి కారణాలను వివరించాలన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు యూన్సీ, లోకేశ్వరరావు, వరకుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

✦ వెలిగండ్ల మండలం మల్లంరాజుపల్లికి చెందిన గ్రామస్తులు మీకోసంలో అధికారులను కలిసి తమ గ్రామంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులు, గర్భిణులకు పంపిణీ చేయాల్సిన రేషన్ సక్రమంగా అందచేయడం లేదంటూ ఫిర్యాదు చేశారు. రికార్డుల్లో తప్పుడు లెక్కలు చూపుతున్నారని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ అందజేశారు.

✦ పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ఇటీవల సస్పెండ్ చేసిన వ్యాయామ ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ తొలగించాలని కోరుతూ పాఠశాల విద్యార్థినులు, తల్లిదండ్రులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గడిచిన 12 సంవత్సరాలు విద్యార్థినులను క్రమశిక్షణలో ఉంచి మంచి సేవలందించిన వ్యాయామ ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడం బాధ కలిగించిందని సస్పెన్షన్‌కు కుట్ర చేసిన వారిని పట్టుకుని శిక్షించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ విషయాన్ని పూర్తిగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

✦ ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలేనికి చెందిన ముంతా మౌనిక గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తాను డిగ్రీ వరకు చదువుకున్నాని అంగవైకల్యం ఉండటం , ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ జీవనం కష్టంగా ఉందని ప్రభుత్వం తరఫు/న సహకారం అందించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ అందజేసింది.

మందుబాబుల ఆగడాలు అరికట్టండి

- ఆలకూరపాడు గ్రామస్తుల వినతి

టంగుటూరు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ మహిళలకు, పాఠశాల విద్యార్థులకు అసౌకర్యం కల్పిస్తున్న మందుబాబుల ఆగడాలను అరికట్టాలని ఆలకూరపాడు గ్రామస్తులు సోమవారంగ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఆలకూరపాడు గ్రామంలో కొందరు వ్యక్తులు బెల్ట్ షాపులను నిర్వహిస్తూ వేళాపాళా లేకుండా మద్యం అమ్ముతున్నారని, వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామంలోని చెరువు చుట్టూ దేవాలయాలు, పక్కనే ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రెండూ ఉన్నాయి. సుమారుగా ఈ పాఠశాలలో 360 మందికి పైగా విద్యార్థులున్నారు. పాఠశాల ఆవరణలో కొంత మంది ఆకతాయిలు మద్యం తాగుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాలను సేవిస్తూ అరాచకమైన పనులు చేస్తున్నారని పాఠశాల విద్యా కమిటీ సభ్యులు తెలిపారు. వారిని నిలువరించేందుకు ప్రయత్నిస్తే తమపై దాడులకు తిరగబడుతున్నారని వాపోయారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో వారు భయభ్రాంతులకు లోనై వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు కట్టమీద ఉన్న బల్లల మీద కూర్చొని మద్యం తాగుతూ అసభ్యకరమైన పదజాలంతో వచ్చే వారిని మాట్లాడుతూ స్త్రీలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. కొందరు మందుబాబులు పట్టపగలే షాపుల దగ్గర మద్యం తాగుతూ షాపుల యజమానులను సైతం వికృత చేష్టలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని దుకాణదారులు వాపోతున్నారు. స్థానిక టంగుటూరు పోలీస్ స్టేషన్లో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా మందుబాబుల ఆగడాలు అడ్డుకట్ట పడకపోవడంతో చేసేదేమీ లేక తామంతా కలెక్టర్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నామని గ్రామస్తులు తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సహించం



విశాఖ ఉక్కును కాపాడాలని కోరుతూ ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీలు

ఒంగోలు టౌన్:

విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తే సహించేదిలేదని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వామపక్ష, రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు రక్షణ, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్న కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తకోట వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు ప్రసంగిస్తూ.. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేవలం మాటలకు మాత్రమే పరిమితం కాకుండా చేతల్లో చేసి చూపించాలన్నారు. విశాఖ ఉక్కును నష్టాల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండగా కేంద్ర కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వామపక్షాలు చేస్తున్న పోరాటాల కారణంగా ప్రైవేటీకరణ చేయలేక కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. విశాఖ ఉక్కు కోసం రూ.15 వేల కోట్లను కేటాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటినపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇప్పటికి రూ.500 కోట్లను విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం వాటిని జీఎస్టీ పన్ను కింద తిరిగి తీసుకున్నారన్నారు. ఉద్యోగులను బదిలీ చేయడం, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలు చెల్లించకపోవడం, ముడి సరుకు రాకుండా అడ్డుకోవడం లాంటి చర్యల ద్వారా విశాఖ ఉక్కును క్రమేణా మూసివేసేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని వివరించారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొనిరావాలని కోరారు. ఈ ధర్నాలో రైతు, కార్మిక సంఘాల నాయకులు పి.కల్పన, కంకణాల రమాదేవి, జయంతి బాబు, సుబ్బారావు, ఎంఏ సాలార్, తంగారాల మహేష్, వేసుపోగు మోజెస్, బాలకోటయ్య, భీమవరపు సుబ్బారావు, తంబి శ్రీనివాసరావు, సర్దార్, శ్రీరాం శ్రీనివాసరావు, టంగుటూరు రాము, బసవన్నయ్య, రాంబాబు, దామా శ్రీనివాసరావు, కె.ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

20.4 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20.4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. మార్కాపురం డిప్యూటీ తహసీల్దార్ బి. శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వడ్లమాను శివారెడ్డి, బాపట్ల జిల్లా యుద్ధనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన దేవరకొండ శ్రీను, మార్కాపురం పట్టణంలో 10 వార్డులో నివాసం ఉండే సయ్యద్ మజీద్ పట్టణ శివారులలోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. ఎస్సై సైదుబాబు, సిబ్బందితో కలిసి వారిని పట్టుకునేందుకు వెళ్లగా పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకొని తనిఖీ చేయగా గంజాయిని గుర్తించామన్నారు. విచారణలో వినుకొండ రైల్వే స్టేషన్‌లో సాధువుల వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో శివారెడ్డిపై గుంటూరు రేంజ్‌లో సుమారు 65 దొంగతనం కేసులు, దేవరకొండ శ్రీనుపై 20 దొంగతనం కేసులు, మజీద్‌పై 15 దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. వీరు ముగ్గురు జైలులో పరిచయమై విలాసాలకు కోసం దొంగతనాలు, గంజాయి అమ్మకాలు చేస్తున్నట్లు వివరించారు. అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్14రోజులురిమాండ్ విధించినట్లు తెలిపారు.

పిడుగుపాటుకు 12 మేకలు మృతి



మృత్యువాతపడ్డ మేకల వద్ద విలపిస్తున్న మీరావలి

మద్దిపూడి: పిడుగుపాటుకు 12 మేకలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండలంలోని సన్నమూరులో సోమవారం జరిగింది. బాధితుల వివరాల మేరకు.... కృష్ణాజిల్లా వల్లూరు గ్రామానికి చెందిన వాడపల్లి మీరావలి బతుకుదెరువు నిమిత్తం కుటుంబసభ్యులతో మద్దిపూడి మండలం సన్నమూరు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. కూలిపనికి వెళుతున్నా, జీవనం కష్టం కావడంతో అప్పు చేసి మేకలు కొనుగోలు చేసి ఎకర పొలం కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం మీరావలి గ్రామానికి దక్షణం వైపు ఉన్న పొలాల్లోకి మేకలను తోలుకుపోయాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో మేకలన్నీ చెట్టు కిందకు చేరుకున్నాయి. ఆ సమయంలో ఒక్కసారిగా పిడుగుపాటుకు గురై 12 మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రమాదంలో రూ.2 లక్షలకు పైగా నష్టపోయాయని వాపోయాడు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వేదికపై ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు

- మేమంతా వైఎస్సార్ సీపీలోనే ఉంటాం..
- 2029 ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తాం
- కొత్తపట్నం మండల ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌ల ఏకగ్రీవ తీర్మానం
- 500 మంది కార్యకర్తలతో వైఎస్సార్ సీపీ మండల సమావేశం
- జనసేనలో చేరేది లేదని స్పష్టం

కొత్తపట్నం:

తామంతా వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతామని, ఇతర పార్టీల్లోకి మారే ప్రసక్తే లేదని ఆ పార్టీ కొత్తపట్నం మండల ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తెగేసి చెప్పారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ మారుతున్న నేపథ్యంలో.. వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల శ్రేణులు, ఆ పార్టీకి చెందిన మండలంలోని ప్రజాప్రతినిధులంతా కలిసి సోమవారం సాయంత్రం స్థానిక శ్రీవాసవీ కల్యాణ మండలంలో సమావేశమయ్యారు. మండలంలోని 15 పంచాయతీల నుంచి వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజాప్రతినిధులతో పాటు 500 మంది వరకూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడారు. గవుళ్లపాలెం కార్యకర్త తాతా నాంచార్లు మాట్లాడుతూ బాలినేని శ్రీనివాసరెడ్డి జనసేన పార్టీలోకి వెళ్లినా.. ఆయన వెంట ఆ పార్టీలో చేరేందుకు తమ గ్రామం నుంచి ఎవరూ సిద్ధంగా లేరని తెలిపారు. తామంతా వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతామని చెప్పారు. అదేవిధంగా ఈతముక్కల మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో గెలిచేందుకు అబద్ధపు హామీలిచ్చి జనాన్ని మోసం చేసేవారు కాదని, చేయగలిగినవి మాత్రమే చెప్పారని తెలిపారు. కానీ, చంద్రబాబు మోసపూరిత హామీలతో గెలిచారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి కోసం తామంతా వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతామని తేల్చి చెప్పారు. కసుకుర్తి శ్రీను మాట్లాడుతూ తాను ఎస్సీ సామాజికవర్గానికి చెందినవాడినని, తమకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందాయని, అందుకే తామంతా వైఎస్సార్ సీపీలోనే ఉంటామని అన్నారు. కొత్తపట్నం నుంచి కోడూరి శ్రీను, సంకువారిగుంట నుంచి కసుకుర్తి వెంకట్రావు, రాజుపాలెం నుంచి మార్పూరి చక్రారెడ్డి, ఆళ్ల రవీంద్రరెడ్డి, రంగాయపాలెం నుంచి గాలి ముసలారెడ్డి, ఆలూరు నుంచి పల్లప్రోలు జానకిరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు ములకా రామిరెడ్డి, మడనూరు నుంచి సామంతుల వీరారెడ్డి, తదితరులంతా సభాముఖంగా వైఎస్సార్ సీపీలో కొనసాగుతామని, పార్టీ మారేది లేదని స్పష్టం చేశారు.

జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకుందాం : ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పార్టీ మారుతున్న నేపథ్యంలో ఆయన వెంట నడవలేకపోతున్నందుకు తనకు బాధగానే ఉందని, కానీ, 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసుకోవడమే తన లక్ష్యమని, అందుకోసం తన పరిధిలో శాయశక్తులా కృషి చేస్తానని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి తెలిపారు. అందుకోసం వైఎస్సార్ సీపీలోనే తాను కొనసాగుతానని స్పష్టం చేశారు. 2014లో టీడీపీ నాయకులు తనను ఎన్నో ఇబ్బందులు పెట్టినప్పటికీ పార్టీ మారలేదన్నారు. ఇప్పుడు కూడా ఎన్ని ఇబ్బందులు వచ్చినా వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతానని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద భర్త రాంబాబు మాట్లాడుతూ తాము కూడా పార్టీ మారే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో సుమారు 500 మంది కార్యకర్తలు పాల్గొనగా, నాయకుడు పిచ్చిరెడ్డి, ఎంపీటీసీలు మిట్నసల శాంతారావు, ఉప్పుటూరి కోటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు బాజీ, సర్పంచ్‌లు షైలేష్, కోడూరి గోపి, కారాని జయరావు, విశ్వనాథపల్లి ఆనంద్ రావు, వీరేపల్లి రామచంద్రారెడ్డి, వాయల మోహన్‌రావు, రాజగోపాల్‌రెడ్డి, బండారు వెంకటాద్రి, గాదె కోటిరెడ్డి, గాలి ముసలారెడ్డి, గోవింద్, కసుకుర్తి వెంకట్రావు, సామంతుల వీరారెడ్డి, వెంకటనారాయణ, తంబి వెంకటేశ్వర్లు, పురిణి శ్రీనివాసరెడ్డి, ద్వారం మురళి తదితరులు హాజరై తామంతా వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతామని, పార్టీ మారేది లేదని ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీకి ఫిర్యాదు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఇన్‌స్టాగ్రామ్‌లో తమ ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని కలిసిన బాధితులు.. తమ సమస్య చెప్పుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లోని ఒక అకౌంట్ నుంచి తమ ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి షేర్ చేస్తున్నారని వాపోయారు. స్టేటస్‌లు పెడుతూ డబ్బులు పంపించమంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, చట్టపరంగా విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఒంగోలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు తన వద్ద నుంచి రూ.3 లక్షలు వసూలు చేశారని ఒంగోలుకు చెందిన ఒక యువకుడు ఫిర్యాదు చేశాడు. తనతోపాటు మరికొందరి వద్ద నుంచి కూడా ఇదే విధంగా డబ్బు వసూలు చేశారని తెలిపారు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో తన వద్ద నుంచి తీసుకున్న డబ్బు తిరిగివ్వమని అడుగుతుంటే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చీటీపాట పేరుతో హైదరాబాద్‌కు చెందిన ఒక మహిళ తన వద్ద నుంచి రూ.5 లక్షలు కట్టించుకుని మోసానికి పాల్పడిందని ఒంగోలుకు చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. చీటీ కట్టించుకుని తనకు డబ్బు చెల్లించకుండా వేధిస్తోందని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 115 మంది ఫిర్యాదుదారులు ఎస్పీని కలిసి వివిధ సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదులు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎస్పీ.. ఆయా పోలీసుస్టేషన్ల అధికారులతో మాట్లాడారు. ప్రజా సమస్యల వేదికలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, తాలూకా సీఐ అజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, ప్రజా సమస్యల పరిష్కారవేదిక ఎస్సైలు రజియాబేగం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

● పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: స్కిల్ డెవలప్‌మెంట్, ఎంప్లాయిమెంట్, నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక భవనంలో జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటలకు సుమారు 20 కంపెనీలతో కనిగిరిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ శ్రీలత, ఎస్‌డీసీ లోకేశ్వరరావు, స్టెప్ సీఈఓ ఉమాదేవి, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా స్వర్ణాంధ్ర మిషన్-2047కు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

తల్లిని కోల్పోయిన పిల్లలకు మెప్మా అండ



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను పిల్లలకు అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: స్థానిక లాయర్‌పేట సాయిమణికంఠ మహిళా సమాఖ్యకు రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్న పులిచర్ల శాంతి మరణించడంతో ఆమె పిల్లలకు మెప్మా అధికారులు, సిబ్బంది అండగా నిలిచారు. మెప్మా పీడీ తేళ్ల రవికుమార్ తనవంతుగా రూ.5 వేలు సాయం చేశారు. ఆ స్ఫూర్తితో సీఎంఎంఎం కొండయ్య, సీఓలు, రిసోర్స్ పర్సన్లు అందరూ కలిసి రూ.2 లక్షల వరకు సహాయం ప్రకటించారు. ఆ నగదును యూనియన్ బ్యాంకులో డిపాజిట్ చేసి ఆ డిపాజిట్ బాండ్లను సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అమ్మమ్మ, తాతయ్యల సంరక్షణలో ఉన్న శాంతి కుమార్తె, కుమారుడు లేఖన, కార్తికేయలకు అందజేశారు. మెప్మాలో పనిచేస్తూ మరణించిన కుటుంబానికి అండగా నిలబడిన అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మెప్మా సిబ్బంది రవీంద్ర, సుబ్బారావు, మరియమ్మ, రమణమ్మ, రాజేశ్వరి, రూపాలక్ష్మి, రత్నకుమారి, మైమున్నీషా, మాధవి, సుజారాణి, ఆర్పీలు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై అత్యాచారం

- పొదిలి మండలం మూగచింతలలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి

పొదిలి రూరల్: మతిస్థిమితం సరిగ్గా లేని మహిళపై ఓప్రబుద్ధుడు బలత్కారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొదిలి మండలంలోని మూగచింతల గ్రామంలో నాలుగు రోజుల క్రితం ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఇదే గ్రామానికి చెందిన వేల్పుల రాహేలయ్య రైతు వద్ద పొలంలో కూలి పనులు చేస్తుండేవాడు. అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం సరిగా లేని మహిళకు తల్లిదండ్రులు లేకపోవడంతో అన్న వదినల దగ్గర ఉంటూ కూలి పనులకు వెళ్లేది. అయితే వారం రోజుల నుంచి ఈమె మేకలు కాసుకోవడానికి పొలానికి వెళ్తోంది. ఆ ప్రాంతంలో పొగనారు దొడ్ల వద్ద ఉన్న వేల్పుల రహేలయ్య ఈమెపై బలాత్కారం చేశాడు. జరిగిన విషయం ఎవరికీ చెప్పవద్దని భయపెట్టాడు. అయితే అమ్మాయికి రక్తస్రావం అవడంతో అన్న వదిన కనిగిరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. డాక్టరు జరిగిన విషయాన్ని వారికి తెలియజేయడంతో పాటు రక్తస్రావం ఎక్కువ కావడంతో మెరుగైన వైద్యం కోసం వెంటనే ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో వెంటనే ఒంగోలు రిమ్స్‌లో చేర్చారు. మతిస్థిమితం లేని మహిళపై బలాత్కారానికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సీఎం సభలో కానిస్టేబుల్ చేతివాటం



ఘటనా స్థలంలో కానిస్టేబుల్ డబ్బు తీసుకుంటున్న సీసీ ఫుటేజీ



కింద పడిన నగదు అందుకుంటున్న కానిస్టేబుల్

నాగులుప్పలపాడు: 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 20వ తేదీ నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో బందోబస్తులో ఉన్న కానిస్టేబుల్ తన చేతివాటం ప్రదర్శించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెలికాప్టర్ దిగడానికి చదలవాడ గ్రామంలోని ఓ ప్రైవేటు విల్లా వద్ద ఉన్న హెలిప్యాడ్‌లో అధికారులు ఏర్పాట్లు చేశారు. విల్లా పరిసర ప్రాంతాల్లో దర్శి సబ్ డివిజన్‌కు చెందిన పోలీసులను బందోబస్తుగా ఏర్పాటు చేశారు. అయితే విల్లా ఎదురుగా ఉన్న ఓ కూల్‌డ్రింక్ షాపులో ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన చింతల వెంకట్రావు వాటర్ బాటిల్ కొనుగోలు చేసి పర్సులో నుంచి డబ్బులు తీస్తున్న క్రమంలో వెంకట్రావు జేబులో నుంచి సుమారు రూ.13 వేలు కిందపడిపోయాయి. ఈ విషయం గమనించని బాధితుడు వాటర్ బాటిల్ తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఆ సమయంలో డబ్బులు కింద పడిన విషయం గమనించి అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తన చేతివాటం ప్రదర్శించి వెంటనే కిందపడిన నగదును తీసుకొని తన జేబులో పెట్టుకున్నాడు. అనంతరం బాధితుడు డబ్బులు పోయిన విషయం గుర్తించి పోలీసులకు తెలియజేయడంతో దగ్గర్లోని సీసీ ఫుటేజీ ని పరిశీలించగా కానిస్టేబుల్ చేతివాటం స్పష్టంగా కనిపించింది. ఈ విషయంలో ఎస్పీ సీరియస్ గా ఉన్నట్లు తెలిసింది. సదరు కానిస్టేబుల్ ను శాఖ పరంగా విచారిస్తున్నట్లు అతనిపై సస్పెన్షన్ వేటు వేయనున్నట్లు సమాచారం.

టీడీపీ నాయకుల భూ ఆక్రమణపై ఫిర్యాదు



తహసీల్దార్ రజనికుమారికి వినతిపత్రం అందజేస్తున్న తిరుపతిరావు, గొర్రెల పెంపకందారులు

కురిచేడు: పశువుల మేత భూమికి వెళ్లే దారి ఆక్రమించిన టీడీపీ నాయకుడు మేరువ పెద్దిరెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఏపీ గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు దారిని సర్వేచేసి ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయాలని ఆయన కోరారు. మండలంలోని గొల్లపాలెం గ్రామ సర్వేనంబరు 77/1,2,3,4,5 లలో 20 ఎకరాల భూమిని బినామీ పేర్లతో టీడీపీ నాయకుడు మేరువ పెద్దిరెడ్డి 2002 నుంచి అనుభవిస్తున్నాడని, ఆ భూమిలో పూర్వం నుంచి ఉసుళ్లబండ, దండుబాట దారి ఉండేదన్నారు. దానిలో ఉన్న పశువుల దారి సైతం ఆక్రమించి గొర్రెలను మేతకు రానీయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన తెలిపారు. గత ఏడాది ఆగస్టు నెలలో గొర్రెల, మేకల పెంపకందారుల ఆధ్వర్యంలో 5 వేల గొర్రెలతో తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించినట్లు ఆయన గుర్తుచేశారు. అప్పటి తహసీల్దార్ జ్వాలా నరసింహం పొక్లెయిన్ తో 20 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయించారని, అయితే నెల రోజుల క్రితం ఆ దారిని దున్నివేసినట్లు తిరుపతిరావు తెలిపారు. దారి విషయంలో గొర్రెల, మేకల పెంపకందారులు అనేక సంవత్సరాలుగా ఇబ్బందిపడుతున్నారని, మొత్తం భూమిని సర్వేచేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని ఆయన తహసీల్దార్ రజనీకుమారిని కోరారు. ఆమేరకు వినతిపత్రాన్ని మేకల, గొర్రెల పెంపకందారులతో కలిసి ఆయన తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో గొర్రెల కాపరులు మువ్వ శ్రీనివాసరావు, తెలగొర్ల ఆంజనేయులు, బొరిగర్ల బాలయ్య, మువ్వాపిచ్చయ్య, బొరిగర్ల పెద్ద గాలివెంకటయ్య, మువ్వ వెంకటసుబ్బయ్య, మేకలు, గొర్రెల పెంపకందారులు పాల్గొన్నారు.

అధికార పార్టీ దౌర్జన్యం



పోలీసుల సమక్షంలో దానియేలు ఇంటిని పీకివేస్తున్న సిబ్బంది



దానియేలు ఇంటి దగ్గర ఉన్న పోలీసులు

- పారిశుధ్య కార్మికుడి ఇంటిని పీకేసిన సిబ్బంది
- ఒంటిపై పెట్రోలు పోసుకున్న బాధితుడు

పొదిలి రూరల్: మండలంలోని కొండాయపాలెంలో టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసి గ్రామంలోని సచివాలయం పక్కన పారిశుధ్య కార్మికుడు ఉంటున్న ఇంటిని పీకిపారేశారు. గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన కందుల దానియేలు 8 సంవత్సరాల క్రితం రూ.50 వేలు ఖర్చుపెట్టుకుని పంచాయతీ స్థలంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని కుటుంబంతో కలిసి నివాసం నివాసం ఉంటున్నాడు. సచివాలయ వ్యవస్థ వచ్చినప్పటి నుంచి భార్యాభర్తలు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేలు జీతం కాగా, 16 నెలలుగా జీతం రావాల్సి ఉంది. జీతం అందక ఇబ్బంది పడుతూ అధికారుల చుట్టూ వారు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే 3 నెలల క్రితం పంచాయతీ అధికారులు అతని ఇంటిని తొలగించాలని నోటీసు ఇచ్చారు. సర్పంచ్ సన్నెబోయిన మాధవి భర్త సుబ్బారావు, మాదాల వెంకటేశ్వర్లు ఇంటిని వెంటనే తొలగించాలని కొన్ని రోజులుగా దానియేలుపై ఒత్తిడి చేస్తున్నారు. సోమవారం పోలీసుల సమక్షంలో అధికారులు వేరే గ్రామం నుంచి సిబ్బందిని తీసుకొచ్చి ఇంటిని తొలగించారు. ఇప్పటికే తమకు జీతాలు ఇవ్వకపోగా, టీడీపీ నాయకుల ప్రోద్బలంతో అధికారులు దగ్గరుండి మరీ తన ఇంటిని తొలగించడంతో మనస్తాపం చెందిన దానియేలు.. ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పంచాయతీ అధికారులు తమ ఇంటి సామగ్రి కూడా ఇవ్వకుండా సచివాలయంలో దాచుకున్నారని బాధితులు వాపోయారు. కొందరు గ్రామస్తులు వారికి మద్దతుగా నిలవడంతో స్థానిక ఎస్సై సర్దిచెప్పి సామగ్రి తిరిగి ఇప్పించినప్పటికీ.. గూడు లేకుండా చేసి ఆ కుటుంబాన్ని రోడ్డున పడేశారు.

కరాటే ఓవరాల్ ఛాంపియన్‌షిప్ మార్కాపురం



ఓవరాల్ ఛాంపియన్ షిప్ షీల్డుతో కరాటే విద్యార్థులు

మార్కాపురం: కర్నూల్‌లోని పెద్దపాడులో జరిగిన మూడు రాష్ట్రాల కరాటే పోటీల్లో మార్కాపురం ఎమ్ఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నట్లు చీఫ్ ఎగ్జామినర్ ఎం శ్రీనివాసులరెడ్డి, తోట ప్రసాద్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 22 ఆదివారం పెద్దపాడులో జరిగిన పోటీలకు మూడు రాష్ట్రాల నుంచి 500 మంది పాల్గొన్నారు. పోటీల్లో మార్కాపురం విద్యార్థులు 12 మంది పాల్గొని 16 గోల్డ్ మెడల్స్, 9 సిల్వర్స్, 2 బ్రాంచ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. గోల్డ్ మెడల్స్ విభాగంలో పి. కుశాల్, జోయా సిద్దిఖీ, శర్వానీష్, మహితారెడ్డి 2 గోల్డ్ మెడల్స్ సాధించగా తేజోవర్ధన్, హుస్సేన్‌బాషా, యాసీన్ బాషా, కరీంబాషా, సాయి జగదీష్, భార్గవ్, ఎస్‌కే యాసీన్‌లు ఒక్కో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యత్వం తీసుకోవాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లా అధికారులంతా రెడ్‌క్రాస్‌లో జీవితకాల సభ్యత్వం తీసుకోవడంతో పాటు ఆయా శాఖల్లోని ఉద్యోగులు సభ్యత్వం తీసుకుని రెడ్‌క్రాస్ సేవలను విస్తృతపరచడంలో తోడ్పడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. సోమవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన గ్రీవెన్స్ ముగింపు సమయంలో కలెక్టర్ రెడ్‌క్రాస్ సేవలపై మాట్లాడారు. ఇటీవల రెడ్‌క్రాస్ సేవలను పరిశీలించామన్నారు. రక్తం కొరత తీర్చేందుకు రెడ్‌క్రాస్ అంతర్జాతీయ స్థాయి బ్లడ్‌బ్యాంక్‌ను నడుపుతోందన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్త నిల్వలు ఉంచుతూ అవసరమైన వారికి సేవలందిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ఉద్యోగులు కూడా సభ్యత్వం తీసుకుని రెడ్‌క్రాస్ సేవలను ప్రజలకు మరింతగా అందేలా సహకరించాలన్నారు. కలెక్టర్‌తో పాటు రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు, కార్యదర్శి స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు, ఏఓ కాంద్ర సుధాకర్ తదితరులు ఉన్నారు.